ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |



TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ఆదివారం 15, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :181 | పేజీలు :4 | వెల. 3/-




# మూసీకి మహర్దశ

## నిజాం స్ఫూర్తితో పునరుజ్జీవ ప్రణాళిక!

- నేడు 'మూసీ రివర్ ఫ్రంట్' మాస్టర్ ప్లాన్ ను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రూ. 4,700 కోట్లతో మురుగునీటి మళ్లింపు..
- గోదావరి జలాలతో నిరంతర ప్రవాహం
- 21 కిలోమీటర్ల మేర తొలి దశ అభివృద్ధి..
- 20 ప్రత్యేక థీమ్ వంతెనలు, 'నైట్ ఎకానమీ'కి పెద్దపీట

2

దశాబ్దాలుగా కాలుష్య కోరల్లో చిక్కుకున్న మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. నిజాం కాలం నాటి అద్భుత పట్టణ ప్రణాళికను, ఆధునిక అంతర్జాతీయ నమూనాలను మేళవించి రూపొందించిన 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్' ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం అధికారికంగా ఆవిష్కరించనున్నారు. భాగ్యనగర గుండెకాయ వంటి మూసీ తీరాన్ని పర్యాటక, ఆర్థిక హబ్ గా మార్చడమే లక్ష్యంగా ఈ బృహత్తర ప్రణాళిక సిద్ధమైంది. హైదరాబాద్ వ్యవస్థాపక కాలంలో మూసీ నది నగరానికి జీవనాడిలా ఉండేది. నదికి ఇరువైపులా పటిష్టమైన ప్రహరీ గోడలు, విశాలమైన రహదారులు, తీరం వెంట పచ్చదనంతో నిజాం పాలకులు తీర్చిదిద్దిన నమూనాను ప్రభుత్వం మళ్ళీ తెరపైకి తెచ్చింది. ప్రస్తుత హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి పరిసరాల్లో కనిపిస్తున్న చారిత్రక నిర్మాణాల శైలిని ప్రతిబింబిస్తూనే, అత్యాధునిక సాంకేతికతతో రివర్ ఫ్రంట్ ను నిర్మించనున్నారు. — ప్రభాత గమనం, హైదరాబాద్

## రేపటి నుంచి ఒంటి పూట బడులు



- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- 'పది' పరీక్షా కేంద్రాల్లో 1 నుంచి సాయంత్రం 5 వరకు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు

2



## మూసీ మురికి కూపం కాంగ్రెస్ చలువే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

— వివరాలు 2వ పేజీలో..

## ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



04

ఆదివారం
15.03.2026
www.prabhatagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక



# మూసీకి మహర్దశ

## నిజాం స్ఫూర్తితో పునరుజ్జీవ ప్రణాళిక!

- నేడు 'మూసీ రివర్ ఫ్రంట్' మాస్టర్ ప్లాన్ ను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రూ. 4,700 కోట్లతో మురుగునీటి మళ్లింపు..
- గోదావరి జలాలతో నిరంతర ప్రవాహం
- 21 కిలోమీటర్ల మేర తొలి దశ అభివృద్ధి..
- 20 ప్రత్యేక థీమ్ వంతెనలు, 'నైట్ ఎకానమీ'కి పెద్దపీట

ప్రభాత గమనం, హైదరాబాద్ :
దశాబ్దాలుగా కాలుష్య కోరల్లో చిక్కుకున్న మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. నిజాం కాలం నాటి అద్భుత పట్టణ ప్రణాళికను, ఆధునిక అంతర్జాతీయ నమూనాలను మేళవించి రూపొందించిన 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం అధికారికంగా ఆవిష్కరించనున్నారు. భాగ్యనగర గుండెకాయ వంటి మూసీ తీరాన్ని పర్యాటక, ఆర్థిక హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ఈ బృహత్తర ప్రణాళిక సిద్ధమైంది.

### నిజాం నాటి వైభవం.. ఆధునిక రూపం

హైదరాబాద్ వ్యవస్థాపక కాలంలో మూసీ నది నగరానికి జీవనాడిలా ఉండేది. నదికి ఇరువైపులా పటిష్టమైన ప్రహరీ గోడలు, విశాలమైన రహదారులు, తీరం వెంట పచ్చదనంతో నిజాం పాలకులు తీర్చిదిద్దిన నమూనాను ప్రభుత్వం మళ్ళీ తెరపైకి తెచ్చింది. ప్రస్తుత హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి పరిసరాల్లో కనిపిస్తున్న చారిత్రక నిర్మాణాల శైలిని ప్రతిబింబిస్తూనే, అత్యాధునిక సాంకేతికతతో రివర్ ఫ్రంట్‌ను నిర్మించనున్నారు.
కాలుష్యానికి చెక్.. ₹4,700 కోట్లతో ట్రంక్ లైన్లు
మూసీని వేధిస్తున్న ప్రధాన సమస్య 160 నాలాల ద్వారా వచ్చి చేరుతున్న మురుగునీరు. దీనిని అరికట్టేందుకు వాటర్ బోర్డు భారీ ప్రణాళిక సిద్ధం చేసింది:

- **ట్రంక్ లైన్లు:** నదిలోకి మురుగు చేరకుండా ఇరువైపులా ప్రత్యేక డ్రైనేజీ లైన్ల నిర్మాణం.
- శుద్ధి ప్లాంట్లు (STP): అత్యాధునిక సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా కేవలం శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.
- నిధులు: ఈ పనుల కోసం ప్రాథమికంగా రూ. 4,700 కోట్లు కేటాయించనున్నారు.

### గోదావరి నీటితో 'నిరంతర' జీవం

మూసీలో కేవలం వర్షాకాలంలోనే కాకుండా ఏడాది పొడవునా స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా గోదావరి జలాలను మళ్లించనున్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ పనులు పూర్తి చేసి, నదిని జలకళతో ఉట్టిపడేలా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, నగర వాతావరణంలో ఆహ్లాదకరమైన మార్పులు రానున్నాయి.

### అంతర్జాతీయ నమూనాలు - ఆర్థిక వృద్ధి

దక్షిణ కొరియాలోని జుంగ్‌నాంగ్ నది, అహ్మదాబాద్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ విజయవంతమైన నమూనాలను ప్రభుత్వం అధ్యయనం చేసింది.

- **నైట్ ఎకానమీ:** నది తీరంలో 24 గంటల పాటు వాణిజ్య కార్యకలాపాలు సాగేలా ప్రణాళిక రూపొందించారు. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించనుంది.
- **గాంధీ సరోవర్:** బాపూఘాట్ వద్ద 100 మీటర్ల ఎత్తైన టవర్‌పై మహాత్మా గాంధీ విగ్రహం, మ్యూజియం ఏర్పాటు చేసి దీనిని నగరానికే తలమానికంగా మార్చనున్నారు.

### 21 కిలోమీటర్ల మేర తొలి దశ పనులు

మొదటి విడతలో భాగంగా గండిపేట, హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపడతారు.

- **ఐకానిక్ వంతెనలు:** మూసీపై 20 కొత్త వంతెనలు నిర్మిస్తారు. ఒక్కో వంతెనను ఒక్కో ప్రత్యేక థీమ్‌తో నిర్మించడమే కాకుండా, వాటి కింద చెక్ డ్యామ్‌లు కట్టి నీటిని నిల్వ చేస్తారు.

**వినోదం:** ఈ నిల్వ నీటిలో బోటింగ్ సౌకర్యాలు, తీరం వెంట వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ జోన్లు ఏర్పాటు కానున్నాయి. మొత్తానికి, ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నగరం గ్లోబల్ సిటీల సరసన నిలవడమే కాకుండా, మూసీ తీరం ఒక అద్భుత పర్యాటక కేంద్రంగా మారుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# మూసీ మురికి కూపం కాంగ్రెస్ చలువే

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

ప్రభాత గమనం, హైదరాబాద్: 'ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు డబ్బుల్లేవుగానీ, రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణకు డబ్బులు వస్తాయట' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ రాష్ట్ర నిర్మాణం గురించి మాట్లాడితే.. నిన్నటి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి విధ్వంసం గురించి మాట్లాడారని ఎద్దేవా చేశారు. మూసీ అభివృద్ధిపై రాజేంద్రనగర్ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లో 'పవర్ పాయింట్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద, పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. ''మూసీని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీనే. గత పాపాలకు ముక్కు నేలకు రాసి సీఎం,



కాంగ్రెస్ పార్టీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవానికి కేసీఆర్ హయాంలో చర్యలు తీసుకున్నాం. కొన్ని ఇళ్లు కూల్చాల్సి వస్తుందని కొన్ని సంస్థలు సూచించాయి. రివర్ బెడ్ నిర్మాణాలైతే తప్ప.. మిగతావి ముట్టవద్దని కేసీఆర్ చెప్పారు. తప్పకుండా కూల్చాల్సి వస్తే.. ప్రాజెక్టును పక్కన పెడదామని అన్నారు. ఐదు కిలోమీటర్ల మేర పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని కేసీఆర్ సూచించారు. నాగోల్, ఉప్పల్, అంబర్‌పేట మధ్య ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా ప్రాజెక్టు చేపట్టారు. రూ.4 వేల కోట్లతో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా మురుగునీరు శుద్ధీకరించాం.కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి సొంత ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నది నిజం కాదా? రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌లో లేదా? హిమాయత్‌సాగర్ పూడ్చి పొంగులేటి ఇల్లు కట్టుకుంది నిజం కాదా? పట్నం మహేందర్‌రెడ్డి ఇల్లు కూడా హిమాయత్ సాగర్‌లోనే ఉంది. మంత్రి వివేక్, కేవీపీ ఫాంహౌస్‌లు హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో లేవా?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

# ఆర్టీసీలో సమ్మె సైరన్

## ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇచ్చిన కార్మికులు

ప్రభాత గమనం, హైదరాబాద్ : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న నేతృత్వంలో జేఏసీ నాయకులు, కార్మికులు బస్ భవన్‌లో అధికారులకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలుచేయాలని డిమాండ్ చేశారు.



# రేపటి నుంచి ఒంటి పూట బడులు

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- 'పది' పరీక్షా కేంద్రాల్లో 1 నుంచి సాయంత్రం 5 వరకు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు

ప్రభాత గమనం, హైదరాబాద్ : ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రతియేడు మాదిరిగానే ఈసారి ఎండలు మండిపోతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులను నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నెల 16 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం వేళల్లో మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మాత్రమే తరగతులను నిర్వహించాలని సూచించింది. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు భోజనం అందించాలని సూచించింది. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులను నిర్వహించాలని పేర్కొంది. ఈ విద్యా సంవత్సరం చివరిరోజైన ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలను పునఃప్రారంభిస్తారు.

# పెళ్లికి నిరాకరించిందని.. యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్

ప్రభాత గమనం, ఘట్‌కేసర్: హైదరాబాద్‌లోని పోచారం ఐటీకారిడార్ పీఎస్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందని యువతికి ఓ యువకుడు హెచ్ఐవీ ఉన్న రక్తాన్ని ఎక్కించాడు. నిందితుడు మనోహర్‌తో బాధిత యువతికి గతంలో వివాహం నిశ్చయమైంది. అయితే.. అతడికి హెచ్ఐవీ ఉందని తెలియడంతో ఆమె పెళ్లికి నిరాకరించింది. ఈ క్రమంలోనే ఈ నెల 11న యువతి ఇంటికి వెళ్లిన నిందితుడు పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో హెచ్ఐవీ ఇంజెక్షన్ ఎక్కించి పారిపోయాడు.

# సరిపడా వంటగ్యాస్

- **డొమెస్టిక్ సిలిండర్లు వాణిజ్యానికి వాడొద్దు**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



ప్రభాత గమనం, హైదరాబాద్ : రాష్ట్రంలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. అయితే వాణిజ్య సిలిండర్ల సరఫరాలో కొంత కొరత ఉందని, అదనపు సిలిండర్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. సీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కమిటీ, జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ల సరఫరా డిమాండ్‌లో కేవలం 20 శాతం మాత్రమే తీరుతోందన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు సిలిండర్ల సరఫరాలో ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గ్యాస్ కొరత ప్రభావం ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లపై పడిందన్నారు. ఎల్పీజీ సిలిండర్లను బ్లాక్ మార్కెటింగ్ చేయడం, వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్లు 1800-428-00333, 1967లను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌లో ఉన్న సమస్యలను సరిచేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు భయాందోళనకు గురై అవసరం లేకుండా గ్యాస్ బుకింగ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర అవసరాల కోసం రాష్ట్రంలో 1,740 కిలోలీటర్ల కిరోసిన్ అందుబాటులో ఉంచినట్లు మంత్రి వెల్లడించారు.

# మామునూరు వద్ద రోడ్డు ప్రమాదం

**- బొలెరో ఢీకొని ఇద్దరు యువకులు మృతి**





ప్రభాత గమనం, మామునూరు:
వరంగల్ – ఖమ్మం హైవేపై వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మామునూరు వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం స్కూటీని బలంగా ఢీకొట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు శ్రీపతి వంశీ, శ్రీపతి రాజుగా గుర్తించారు. వీరు పనికి వెళుతూ స్కూటీపై ప్రయాణిస్తుండగా మామునూరు పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం అదుపుతప్పి ఢీకొట్టింది. ఢీకొట్టిన ప్రభావంతో స్కూటీ పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. యువకులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే బొలెరో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. భారీ శబ్దం రావడంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని చూసేసరికే యువకులు రక్తపు మడుగులో పడి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# వేం కు శుభాకాంక్షలు

ప్రభాత గమనం, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేంనరేందర్ రెడ్డిని హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో రడం శివజ్యోతి–దిలీప్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# కేయూ మాజీ వీసీ లింగమూర్తి కన్నుమూత



అక్షరదర్బార్, హనుమకొండ : కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) మాజీ వైస్ ఛాన్సలర్, విద్యావేత్త ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. లింగమూర్తి 2007 - 2010 వరకు కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్‌గా ఆయన విశిష్ట సేవలందించారు. తన మూడేళ్ల పదవీ కాలంలో విశ్వవిద్యాలయ పురోగతికి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఆయన ఎనలేని కృషి చేశారు. వరంగల్ కేంద్రంగా ఉన్న ఈ ప్రతిష్టాత్మక వర్సిటీకి ఆయన అందించిన సేవలు విద్యార్థులు, అధ్యాపక లోకంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆయన మృతి పట్ల కేయూ ప్రొఫెసర్లు, అధికారులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. విద్యా రంగానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.


# ఆ ఒక్కడు కూడా డుమ్మా

- **ఒకే విద్యార్థి పరీక్ష కోసం ఐదుగురు అధికారుల కేటాయింపు వృథా**

ప్రభాత గమనం, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలో ఆసక్తికర పరిస్థితి నెలకొంది. పరీక్షా కేంద్రంలో జనరల్ విభాగానికి కేవలం ఒకే విద్యార్థి కేటాయించబడగా, ఆ విద్యార్థి కూడా పరీక్షకు హాజరు కాకపోవడంతో కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల పదమూడవ రోజు భాగంగా ఈ పరీక్ష నిర్వహించబడింది. పరీక్షా నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రంలో కనీస సిబ్బందిని తప్పనిసరిగా నియమించాల్సి ఉంటుంది. అందువల్ల కేంద్ర సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్, పోలీస్ సిబ్బంది తదితరంగా మొత్తం ఐదుగురు అధికారులు విధుల్లో హాజరయ్యారు. అయితే పరీక్ష రాయాల్సిన ఒక్క విద్యార్థి కూడా కేంద్రానికి రాకపోవడంతో అధికారులు పరీక్ష సమయం ముగిసే వరకు అక్కడే విధులు నిర్వర్తించాల్సి వచ్చింది. పరీక్ష కేంద్రంలో విద్యార్థి ఒక్కరే ఉండటంతో ఆయన రాకపోవడం అధికారుల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. పరీక్ష సమయం ముగిసే వరకు సిబ్బంది ఎదురు చూసినా ఆ విద్యార్థి హాజరు కాలేదు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా వొకేషనల్ విభాగంలో మాత్రం మంచి హాజరు నమోదైంది. మొత్తం 1,370 మంది విద్యార్థులకు గానూ 1,258 మంది పరీక్షకు హాజరైనట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ తెలిపారు. పరీక్షా నియమావళి ప్రకారం విద్యార్థులు ఉన్నా లేకపోయినా కేంద్రంలో అవసరమైన సిబ్బందిని తప్పనిసరిగా నియమించాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

# నూతన వధూవరులకు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆశీర్వాదాలు


కేసముద్రం మార్చి 14(ప్రభాత గమనం):
కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలోని ఓ వివాహ వేడుకకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్యగౌడ్ శనివారం నాడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద సదానందం మంజుల దంపతుల కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం దంపతులకు పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బిర్రు వెంకన్న, అన్నెపాక వెంకన్న, మంద సాయిబాబా, సీనియర్ జర్నలిస్టు రవిచంద్ర, వార్డ్ మెంబర్ ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు...



ఆదివారం
15.03.2026
www.prabhatagamanam.com
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

మహబూబాబాద్ మార్చి 14(ప్రభాత గమనం):
జిల్లాలోని 45 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించబడుతున్నాయని విద్యాశాఖ అధికారి వి.రాజేశ్వర్ శనివారం నాడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రెగ్యులర్ 8147 మంది విద్యార్థులు అలాట్మెంట్ కాగా, 8141 మంది విద్యార్థులు హాజరయ్యారు. 06 మంది విద్యార్థులు గై హాజరయ్యారు. (ప్రైవేట్ ) వన్స్ ఫెయిల్డ్ లో 04 మంది విద్యార్థులు అలాట్మెంట్ కాగా 03 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒక్కరు గైహాజరయ్యారు.పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రశ్నాపత్రాల భద్రత మరియు పరీక్షల నిర్వహణలో పూర్తి జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీస్ భద్రత, తాగునీరు, విద్యుత్ మరియు ప్రథమ చికిత్స వంటి ఏర్పాట్లు కూడా చేయబడ్డాయని వివరించారు.పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు మరియు ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు టీములు 20 సెంటర్లను తనిఖీ చేశారు. జిల్లా విద్యా శాఖ అధికారి వి. రాజేశ్వర్. 06 సెంటర్లను ఎసిజిఈ మందుల శ్రీరాములు 05 సెంటర్లను తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూతె



లిపారు జిల్లాలోని అన్ని కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.



# ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన ఆశ వర్కర్లు

గార్ల మార్చి 14(ప్రభాత గమనం):
అతి తక్కువ వేతనాలతో ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోరారు.తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గార్ల, బయ్యారం మండలాల కమిటీల ఆధ్వర్యంలో గార్ల మండల కేంద్రానికి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు శనివారం డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల కు ఫిక్సిడ్ వేతనం 18 వేల రూ, లు నిర్ణయించాలని, ఎన్ హెచ్ ఎంకు సరిపడ నిధులు కేటాయించాలని, 2022- 25 వరకు నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న లెప్రసి సర్వే,,పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ, ఎగ్జామ్స్ డ్యూటీలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం,పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి,ఆదివారం పండగ సెలవులు, పని భారం తగ్గించాలని ఎమ్మెల్యే ను కోరారు. ఈ కార్యక్రమం లో గార్ల, బయ్యారం మండలాల ఆశ లు రమాదేవి,సుజాత,దేవి, ఆశ కుమారి, నమ్మి, ఉమా, కౌసల్య, సుజాత, రాణి, కళావతి, యశోద, అన్నపూర్ణ, కౌసల్య, భద్రమ్మ, ఉమా, లక్ష్మి ,శాలి, భద్రమ్మ, అంజమ్మ తదితరులు ఉన్నారు

# విద్యార్థిని శ్రీవిద్యకు ఘన సన్మానం

కేసముద్రం మార్చి 14(ప్రభాత గమనం): మహబూబాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి 'బాలవక్త' పోటీలలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు.మార్చి 13, 2026 శుక్రవారం మహబూబాబాద్‌లో శ్రీ వీరభద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాలవక్త పోటీలలో కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని గోవిందు శ్రీవిద్య డిజిటల్ విద్య వరమా, శాపమా అనే అంశంపై ప్రసంగించి ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు కీర్తి




తీసుకువచ్చింది.ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ చిర్రయాకాంతం గౌడ్ మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు వేదికలపై తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని తెలిపారు. శ్రీవిద్య సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థినికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో దంపతుల హత్య

## మృతులు గుండెంగ గ్రామానికి చెందిన వారు..

హైదరాబాద్ మార్చి 14(ప్రభాత గమనం):
మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామ శివారు గన్యచక్ర తండాకు చెందిన భార్య భర్తలు హైదరాబాద్ పటాన్ చెరులో హత్యకు గురయ్యారు. గన్య చక్ర తండాకు చెందిన ధారావత్ సోము, భార్యా మంగమ్మ జీవనోపాధి కోసం హైదరాబాద్ పటాన్ చెరులో పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే పనికి పోయి వచ్చిన వారు రాత్రి సమయంలో హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. విషయం స్థానికులు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వడంతో పఠాన్ చెరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, హత్యకు గురైన దంపతుల చిన్న కూతురు వసంత 10వ తరగతి ఎగ్జామ్స్ ఉండడంతో స్థానికులు ఆమెను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు.



# 108 వెంకన్న కొడుకు వివాహానికి హాజరైన సమ్మిగౌడ్

ఇనుగుర్తి మార్చి 14(ప్రభాత గమనం):
ఇనుగుర్తి మండల కేంద్రంలోని పప్పుల పద్మ- వెంకన్న (108 వెంకన్న) కుమారుడు రాకేష్ -రమ్య ల వివాహ వేడుక శనివారం అత్యంత అట్టహాసంగా, వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్, మాలమహానాడు జాతీయ కార్యదర్శి మన్నే బాబురావు, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ముఖ్య అతిధులు గా పాల్గొని నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, పిల్లా పాపలతో భవిష్యత్ ని ఆనందంగా గడపాలని నూతన వధూవరులను ఆశీర్వధించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంద బాబురావు,జాతీయ కార్యదర్శి ఆశోద భాస్కర్ హాజరై వారితో పాటు అద్దంకి యువసేన గార ఉపేందర్, మానుకోట జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల మహేష్, పప్పుల వెంకన్న (టీచర్), పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షులు ఎనమాల రాకేష్, కారం ప్రశాంత్, అనపర్తి నాగేష్ , ఎల్ ఐ సి ఉప్పలయ్య,ఏ ఎన్ ఎం కవిత, పలుస రాకేష్ గౌడ్ తదితరులు హాజరై వివాహ వేడుకలో పాలుపంచుకున్నారు.

# బావిలో క్రేన్ కూలి ముగ్గురు మృతి

హైదరాబాద్ మార్చి 14(ప్రభాత గమనం) :
వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా క్రేన్ వైర్ తెగి ముగ్గురు కూలీలు మృతి చెందిన ఘటన భూపాలపల్లి జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదలో మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామానికి చెందిన సుకినే దేవారావు (48), బండారి అభిలాష్(16)తో పాటు.. పిడిసిల్ల గ్రామానికి చెందిన పైడయ్య (53) మృతి చెందారు. సుకినే మోహన్ రావు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను పోలీసులు బయటకు తీశారు.



Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra